
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
ఆదివారం 21 ఏప్రిల్ 2024



కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు

పెద్ద బోగస్

- రుణమాఫీ చేస్తామంటే నమ్మేదెలా
- మోసాలు చేయడంలో కేసీఆర్‌ను మించిన కాంగ్రెస్
- ఓడిపోయిన బిడ్డకు, వినోద్‌కుమార్‌కు పదవులు ఇచ్చి పునరావాసం కల్పించారు
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



బీజేపీలో చేరిన చొప్పదండి నియోజక వర్గ నాయకులతో బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు పెద్ద బోగస్ అని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. శనివారం చొప్పదండి నియోజక వర్గానికి చెందిన నాయకులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీలిచ్చిన ఆరు గ్యారెంటీలే పెద్ద బోగస్ అని, మోసాలు చేయడంలో కేసీఆర్‌ను కాంగ్రెస్ నేతలు మించి పోయారన్నారు. వరికి క్వింటాల్‌కు 500 రూపాయలు ఇవ్వలేని కాంగ్రెస్ పార్టీ 30 వేల కోట్ల రుణమాఫీ చేస్తుందంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువు

కాంగ్రెస్‌ను చూస్తే జాలేస్తోందని, ఆ పార్టీకి అభ్యర్థులే కరువయ్యారన్నారు. కాంగ్రెస్ కూటమికి ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పే ధైర్యం కూడా లేదని ఎద్దేవా చేశారు. వానలతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి పోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ గతంలో ఇచ్చిన హామీ మేరకు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా వడ్లను కొనడానికి 700 కోట్లు ఖర్చు చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులను ఆదుకునేందుకు ఆ నిధులను సైతం సమకూర్చలేని ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానంటే రైతులెవరూ నమ్మడం లేదన్నారు. జీతాలు, అప్పులు చెల్లించడానికి నెల నెలా 11 వేల కోట్లను సమకూర్చలేక అపసోపాలు పడుతున్నారన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు

జిల్లాలో ఏ క్షణం వర్షం పడుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇతర జిల్లాల్లో వానలు పడి ఇప్పటికే వరి ధాన్యం తడిసిపోయిందన్నారు. ఇప్పటికే రైతులకు తాలు, తరుగుతేమ పేరుతో క్వింటాలుకు ఐదు కిలోల చొప్పున రైతులు నష్టపోతున్నారన్నారు. వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోలు కేంద్రాల వద్ద సరైన సౌకర్యాలు లేవన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఇచ్చిన మాట ప్రకారం బోనస్ ఇచ్చి వరిని కొంటారా లేదా అని ప్రశ్నించారు.

ఎవరు పునరావాసం పొందారో ఆలోచించాలి

ఎమ్మెల్యేగా ఓడిపోయిన బండి సంజయ్ ఎంపీగా పోటీ చేయడానికి కరీంనగర్ పునరావాస కేంద్రమా అంటు వినోద్‌కుమార్, గంగుల కమలాకర్‌లు అనడానికి సిగ్గుండాలన్నారు. నిజామాబాద్ ఎంపీగా ఓడిన కవితకు ఎమ్మెల్సీ, కరీంనగర్‌లో ఓడిన వినోద్‌కుమార్‌కు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యేగా ఓడిన కొప్పుల ఈశ్వర్‌కు పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. ఇది పునరావాసం కాదా అని ప్రశ్నించారు. ఎవరు పునరా వాసం పొందారో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఇప్పుడు జరుగుతున్నది లోకల్‌కు నాన్ లోకల్‌కు పోటీ అని తెలిపారు. ప్రభుత్వానికి కూల్చాలనే ఉద్దేశం బీజేపీ లేదని, గతంలో బీఆర్‌ఎస్ నుంచి, ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పలువురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. తమ పదవులకు రాజీనామా చేస్తేనే బీజేపీలో చేర్చుకుంటామన్నామన్నారు. గతంలో ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసిన తర్వాతనే బీజేపీలో చేర్చుకున్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు.

రెండో స్థానం కోసమే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటీ

పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లకు 17 సీట్లు బీజేపీ గెలువబోతున్నదన్నారు. కరీంనగర్‌లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు కలిసి పని చేస్తూ డబ్బులు వెదజల్లుతున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు రెండో స్థానం కోసమే పోటీ పడుతున్నారన్నారు. కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచే అవకాశాలే లేవన్నారు. ఆ పార్టీకి డిపాజిట్ కూడా రాదన్నారు. దేశంలో 400 స్థానాలు గెలుచుకుని మోదీ నాయకత్వంలో మూడో సారి కేంద్రంలో అధికారం చేజిక్కించుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనాడైనా ప్రజా సమస్యలపై కొట్లాడారా, కాంగ్రెస్ మంత్రి ఏనాడైనా ఉద్యమాలు చేశారా అని ప్రశ్నించారు. ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసి, 109 కేసులు పెట్టినా భయపడకుండా కేసీఆర్‌ను గద్దెదించే దాకా పోరాటం చేశామన్నారు. హిందూగాళ్ళు, బొందుగాళ్లని హేళన చేసిన కేసీఆర్ చెంప చెళ్లు మనిపించిన చరిత్ర కరీంనగర్ ప్రజలదన్నారు. కాంగ్రెస్ పార్టీ పీఎఫ్ఐ లాంటి ఉగ్రవాద సంస్థలను పెంచి పోషిస్తుంటే వారికి వ్యతిరేకంగా కొట్లాడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. దేశంలో, రాష్ట్రంలో గుంటనక్కలన్నీ ఏకమైనా బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోలేవన్నారు.

● బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు

దేశం అభివృద్ధి చెందాలంటే, పేదల బతుకులు బాగు పడాలంటే మోదీయే ప్రధానిగా ఉండాలని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. కరీంనగర్‌లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. బీజేపీలోకి వస్తున్న నాయకులకు మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని నమ్మి ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే, అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నమ్మక ద్రోహం చేసిందన్నారు.

ఘనంగా హనుమత్ వాహన సేవ



హనుమత్ వాహన సేవలో పాల్గొన్న భక్తులు



హనుమత్ వాహనంపై స్వామివారు

ఇల్లందకుంట, ఏప్రిల్ 20: ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి ప్రభుత్సోత్సవం అనంతరం ఘనంగా హనుమత్ వాహన సేవను నిర్వహించారు. నిత్యవిధి అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పూలతో అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను హనుమత్ వాహనంపై అధిరోహించారు. డప్పుచప్పుళ్లు, మేళాతాళాలు, బాజాబజంత్రీలు, వేదబ్రహ్మణుల మంత్రోచ్చరణుల నడుమ హనుమత్ నామస్మరణ చేస్తూ ఆలయ ప్రాంగణంలో స్వామివారిని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రకటన

ఐందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీ Juvvadi, Vanaja W/o. Muralidhar Rao, Age 55 Yrs Occ: Household, H.NO: 2-44, Moodapally, Chandurthi, Mandal Rajanna Siricilla Dist. R.C.C.Roof House with open place House in bearing Grama panchayath No. 2-44, Total Area 228.55 Sq. Yards equal to (191.09) Sq.Mtrs RCC Roof Ground floor Plinth Area 779.62 Sq.feet & RCC Roof first Flower Plinth Area 464.06 Sq. feets as boundaries, at Moodapally V/o. Chandurthi Mandal Rajanna Siricilla Dist. లో కల ఈ హద్దులు East : House with open place of Pulkam Mallesh. West : Road. North : Open Place of Juvvadi Rajeshwar Rao, South : House of Settlor.

కల దాని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనములో ఉండి నా క్లయింట్ మెస్సర్స్ శ్రీ రామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచి కరీంనగర్-II వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికయినా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (07) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియ జేయగలరు.

ఇట్లు సం/- పిన్నింటి అశోక్, అడ్వకేట్
3-7-852/1, వావిలాలపల్లి, కరీంనగర్.
సెల్ : 9849331558

ప్రకటన

ఐందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీ THOGARU HARSHITH REDDY, S/O. RAM CHANDRA REDDY, Age: 18 Years, Occ: Student, R/o.H.No.1-5, Maqdumpur Village, Karimnagar Rural Mandal, Karimnagar District. Aadhar No.3563 13259497. (DOB 24-08-2004) Cell No.9959268672.

SCHEDULE OF THE PROPERTY

An Open Plot No.3 admeasuring 153.60 Sq. Yards OR 129.02 Sq. Mts., in Sy.No.9/B/2, Situated at Bommakal Village & Grampanchayath of Karimnagar Rural Mandal, Karimnagar District., and under the Jurisdiction of Sub-District Registration and District Registration Karimnagar. BOUNDARIES:- East :Plot No.2., West:Plot No.4., North: Land of Others, South : 30 Feet Wide Road.

కల దాని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనములో ఉండి నా క్లయింట్ మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచి, కరీంనగర్-I వారి వద్ద తనఖా పెట్టుచు న్నారు. కావున ఎవరికయినా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (07) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియ జేయగలరు.

ఇట్లు సం/- పిన్నింటి అశోక్, అడ్వకేట్
3-7-852/1, వావిలాలపల్లి, కరీంనగర్.
సెల్ : 9849331558

మూడో రోజు.. మూడు..

● నామినేషన్ దాఖలు చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రశాంతంగా సాగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి మూడు రోజుల్లో ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మూడొవ రోజు శనివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి నామినేషన్ అందజేశారు. కోహెడ మండలం వెంకటేశ్వరపల్లికి చెందిన పిడిశెట్టి రాజు, జమ్మికుంటకు చెందిన రాపోల్ రామ్‌కుమార్ భరద్వాజ్ స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. మూడో రోజు బీఆర్‌ఎస్ అభ్యర్థితోపాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేయగా రెండో రోజు బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పక్షాన ఆ పార్టీ నాయకులు, మొదటి రోజు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి టి వెంకన్న

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: అగ్నిప్రమాదాల వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిప్రమాదాల కట్టడిపై ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఆధ్వర్యంలో కరీంనగర్ అగ్నిమాపకశాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, ఆసుపత్రులు, గోదాం, షోరూం, ఇతర వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లలో అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై అగ్నిమాపక శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. శనివారం ప్రతిమ మల్టీప్లెక్స్ హోటల్‌లో, బీసీ స్టడీ సర్కిల్‌లో అవగాహన కార్యక్రమాలును ఏర్పాటు చేశారు. ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అగ్నిమాపక అధికారి టి వెంకన్న అవగాహన కల్పించారు.

కొత్తపల్లిలో పంట కోత ప్రయోగం



కొత్తపల్లిలో రైతు వరి పంట పొలంలో పంట కోత ప్రయోగంతో దిగుబడి అంచనా వేస్తున్న అధికారులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 20: మండలంలోని కొత్తపల్లిలో గోలి రాంరెడ్డి అనే రైతు వరిపొలంలో 2023-24 యాసంగి సీజన్‌కు సంబంధించి వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అర్థ గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి కొమురయ్య పర్యవేక్షించారు. ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పులో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ విస్తీర్ణంలో 18.795 కిలోల దిగుబడి వచ్చిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయధికారి బి శ్రీనివాస్, మండల వ్యవసాయధికారి సురేందర్, మండల ప్రణాళిక, గణాంక అధికారి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అకాల వర్షాల భయం

- ఊపందుకున్న కోతలు
- నేరుగా మిల్లులకే ధాన్యం తరలింపు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 20: అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక వైపు మండుటెండలు, మరో వైపు అకాల వర్షాలతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అకాల వర్షాలు కురుస్తాయేమోనని రైతులు దిగులు చెందుతున్నారు. ఇప్పటికే కోతలు ఊపందుకున్నాయి. కరీంనగర్ రూరల్ మండలంలో 17 గ్రామాల పరిధిలో ఆ యేడు 14 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎస్సారెస్పీ నీరు ఆయకట్టు చివరి గ్రామాలకు అందక ఆరు వేల ఏకరాల్లో పంటలు ఎండిపోయాయి. యాసంగి ఎండ తీవ్రతకు సాధరణ హార్వెస్టర్‌తోనే రైతులు వరి కోయిస్తారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో తడిగా ఉన్న పొలాల్లోనూ చైన్ హార్వెస్టర్లతో కోతలు ప్రారంభించారు. మండలంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఎక్కువ మంది రైతులు కోసిన ధాన్యాన్ని నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు.



వరి కోస్తున్న హార్వెస్టర్

ముగిసిన విద్యుత్ సిబ్బంది శిక్షణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 20: టీఎస్ ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందికి ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ సదర్భంగా ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ విద్యుత్ ఉద్యోగులతో భద్రత నిబంధనల ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది వినియోగదారులకు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు కృషి చేయాలన్నారు. డీటీఆర్ ఫెయిల్యూర్స్‌ను తగ్గించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఉద్యోగి జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్తును ఆదా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈలు విజయేందర్‌రెడ్డి, కాళిదాసు, రాజం, గోపికృష్ణ, రాజేశం, ఏడీలు శ్రీనివాసరెడ్డి, జి శ్రీనివాస్, రాజలింగు, మల్లేశం, పురుషోత్తం, తిరుపతి, వీవోపీ చంద్రయ్య పాల్గొన్నారు.

'మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలి'

గణేశ్‌నగర్, ఏప్రిల్ 20: జిల్లాలోని పాఠశాల, కళాశాల స్థాయి బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు సంబంధించిన మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె శ్రీధర్‌రాజు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. ఆగస్టు నుంచి మెస్ చార్జీలు చెల్లించలేదన్నారు. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో కాంట్రాక్టర్లు సరుకులు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే మెస్ చార్జీలు చెల్లించాలని ఆయన కోరారు.





జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: మహారాష్ట్రలోని దాదర్‌లో ఆదివారం నుంచి 24వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి మినీ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేష్ బాధ్యులు జిట్టవేని శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 14న హ్యాండ్‌బాల్ అసోసియేషన్(హాయ్) నిర్వహించిన మినీ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటి టి కారుణ్య, బసరవేని చరణ్‌తేజ, జిట్టవేని సుశాంత్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని జిల్లా పెట అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, యూనుస్‌పాష, హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, అశోక్, రాజ్‌కుమార్, భాస్కర్, రాజేందర్, ఐతరవేని శ్రీనివాస్, అనూప్‌రెడ్డి అభినందించారు.



ఎండల తీవ్రతకు చేపలు మృతి

- రూ. 4లక్షల నష్టం వాటిల్లిందని మత్స్యకారుల ఆవేదన - అధికారులు ఆదుకోవాలని వినతి

ఇల్లందకుంట, ఏప్రిల్ 20: ఎండల తీవ్రతకు మండలంలోని టేకుర్తి గ్రామ ముప్పారం చెరువులో చేపలు మృతి చెందాయి. నాలుగు రోజులుగా దంచి కొడుతున్న ఎండ వేడిమికి సుమారు రెండు టన్నుల చేపలు మృతి చెందాయని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది 2లక్షల పిల్లలు 4లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసి చెరువులో వేశారు. చేపలు కూడా 2కేజీల నుంచి 3కేజీల సైజ్ వరకు పెరిగాయని మత్స్యకారులు చెప్పారు. ఏప్రిల్ మొదటి నుంచి ఎండ తీవ్రత పెరిగింది. దీంతో చెరువులో నీరు క్రమంగా తగ్గింది. చెరువు కింద వరి సాగు చేసస్తున్న కొందరు రైతులు రాత్రి వేళ తూము తీయడం వల్ల నీరు బయటకు వెళ్లింది. చెరువులో నీరు పూర్తిస్థాయిలో తగ్గడంతోనే ఎండ తీవ్రతకు చేపలు మృతి చెందాయని, అధికారులు తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.


ముప్పారం చెరువులో మృతి చెందిన చేపలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


పాక సురేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్ శివారులోని మానేరు వంతెనపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధిపేట జిల్లా తోగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన పాక సురేష్ అలియాస్ సూరజ్ (26) దుర్మరణం చెందాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. బంధువుల ఇంటికి కరీంనగర్‌కు వచ్చి సురేష్ శుక్రవా రం రాత్రి 10 గంటల సమయంలో సిద్ధిపే టకు వెళుతుండగా మానేరు వంతెనపై తన బైక్ అదుపుతప్పి ఫుట్‌పాత్ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన సురేష్ తలకు తీవ్ర గాయా లతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు పాక జైబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గంగాధర, ఏప్రిల్ 20: గంగాధర మండలం మధురానగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల గొట్టి 13 తులాల బంగారం, 4లక్షలు ఎత్తుకెళ్లారు. ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్నాల ప్రశాంత్ తన కుటుంబంతో కలిసి శుక్రవారం రాత్రి కొడిమ్యాల మండలంలో శుభకార్యానికి వెళ్లాడు. శనివారం ఉద యం ఇంటికి చేరుకున్నాడు. తలుపు తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోని బీరువాను తెరిచి చూశారు. అందులోని సుమారు 13 తులాల బంగారం, 20 తులాల వెండి, 4లక్షల ఆరువేలు కనిపిం చలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి దొంగతనం చేశారని. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

రామడుగు, ఏప్రిల్ 20: మండలంలోని గుండి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని గోపాల్‌రావుపేట్ గ్రామానికి చెందిన జానపద డప్పు కళాకారుడు ఏగోలపు మల్లేశ్ (54). అతడి భార్య భారతమ్మ (42) బైక్‌పై కరీంనగర్ వైపు వెళుతున్నారు. ఆ సమయంలో కరీంనగర్ నుంచి గోపాల్‌రావుపేట్‌కు వెళుతున్న లారీ గుండి గ్రామం వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యా భర్తలకు తీవ్రగాలయ్యాయి. స్థానికులు గమనించి కరీంనగర్‌కు తరలించారు.














నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఫైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 20: రామగుండం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలో నాటుసారా తరలిస్తున్న గుగులోతు కిషన్‌నాయక్ అబ్కారీ సిబ్బందికి పట్టుబడ్డాడు. శనివారం న్యూమారేడుపాక చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా అల్లూరు తండా వైపు నుంచి బైక్‌పై నాటుసారా తరలిస్తున్న కిషన్‌నాయక్‌ను ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. కిషన్‌నాయక్ వద్ద నుంచి నాలుగు లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నాటు సారా అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మంగమ్మ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్స్ ఖాదిర్, ప్రసాద్, శ్రావణ్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 750గ్రాముల గంజాయి పట్టివేత, ఇద్దరి అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 20: గోదావరిఖని కాకతీయనగర్‌లోని గంజాయి స్థావరంపై శనివారం రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఒక ఇంట్లో తనిఖీ జరిపి 750గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాకతీయనగర్‌కు చెందిన క్యాటరింగ్ పనిచేసే బీరవేని అభిలాష్(21), హనుమాన్‌నగర్‌కు చెందిన డెలివరీ బాయ్ గంద్రేటి కార్తీక్(21)లను అరెస్టు చేశారు. అనంతరం వారిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు.

కుక్కను కాపాడబోయి.. విద్యుదాఘాతంతో వివాహిత మృతి

మెట్‌పల్లి, ఏప్రిల్, 20: కుక్కకు విద్యుత్ వైరు తగిలి కొట్టుకుంటుండగా దానిని కాపాడే ప్రయత్నంలో ఓ వివాహిత విద్యుదాఘాతంతో మృతి చెందింది. మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో ఉంటున్న పల్లపు పద్మ(29)కు భర్త తులసీరాం, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శనివారం సాయంత్రం పద్మ ఇంటి ముందు కూర్చుని ఉంది. అదే సమయంలో ఇంటి ముందున్న విద్యుత్ వైరు తెగి కుక్కపై పడటంతో విద్యుత్ షాక్‌తో అది కొట్టుకుంటోంది. దీనిని గమనించిన పద్మ వెంటనే అక్కడకు వెళ్లి కాపాడే ప్రయత్నం చేయగా విద్యుత్ తీగ తగిలి షాక్ కొట్టడంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి మృతితో చిన్నారుల రోదనలు మిన్నంటాయి.

పేకాట రాయుళ్ల అరెస్టు

● 18 మంది నుంచి రూ.1.51లక్షలు స్వాధీనం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని అయిలాపూర్ అనుబంధ గ్రామమైన కిషన్‌రావుపల్లె శివారులోని ఓ ఫాం హౌస్‌లో పేకాట ఆడుతున్న వారిని కోరుట్ల, మెట్‌పల్లి ఎస్‌ఐలు కిరణ్‌కుమార్, చిరంజీవి వారి సిబ్బందితో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. ఫాం హౌస్‌లో 18 మంది పేకాట ఆడుతున్న వారిని గుర్తించి అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. వారి వద్ద రూ.1.51లక్షల నగదుతో పాటు 18 సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. భారీ ఎత్తున పేకాటరాయుళ్ల అరెస్టు కావడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది.

● **గంభీరావుపేట:** మండల కేంద్రంలోని నమాజ్ చెరువు వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు నమాజ్ చెరువు ప్రాంతంలో గాలించగా ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని ఎస్‌ఐ రాంమోహన్ పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. 3 వేల 50 రూపాయలు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎవరైనా మానసిక ఆందోళన, ఒత్తిడికి గురైతే వారికి ఫోన్‌లో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. టెలిమానస్ పేరుతో 14416 నంబరులో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మానసిక వైద్యుడి సలహాలు, సూచనలు ఉచితంగా అందచేస్తారని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురైన వారిని లక్షణాల ద్వారా గుర్తించి మానసిక వైద్య నిపుణుల దగ్గరికి తీసుకెళ్లాలని సూచించారు. చికాకు పడడం, ఆసక్తి కోల్పోవడం, నిద్రలేమి, అపరాధ భావన, నిరాశావాదం, నిస్సహాయత, ఆత్మహత్య చేసుకోవాలని అనిపించడం, ఒంటరిగా ఉండాలనుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు భావించాలన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఈ వేసవిలో నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తిగల కోచ్‌లనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో పది కేంద్రాలలో మే 1నుంచి 31వరకు వివిధ క్రీడాంశాలలో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తమ పూర్తి వివరాలతో ఈ నెల 26 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం, కరీంనగర్ నందు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్. 80083 26913 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్



ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్న అధికారులు

ముత్తారం, ఏప్రిల్ 20: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన పులిపాక మహేష్ మానేరు ఇసుకను దొంగతనంగా సీతంపేట గ్రామ శివారులో డంప్ చేసి తరలిస్తుండగా ముత్తారం పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా ఇసుకను డంప్ చేసుకొని అమ్ముకుంటున్నారని సమాచారం మేరకు ముత్తారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

గోధూర్‌లో వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20: మండలంలోని గోధుర్‌లో శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు స్వామి వారిని దర్శించుకున్నారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

● కొండగట్టులో రేపటి నుంచి ఉత్సవాలు ● 23న చిన్న హనుమాన్ జయంతి

మల్యాల, ఏప్రిల్ 20: కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హన్‌మాన్ జయంత్యుత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించే హన్‌మాన్ జయంత్యుత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి దాదాపు మూడు లక్షలకు పైగా దీక్షాపరులు, భక్తులు తరలివస్తుంటారు. దీనికి గాను జయంత్యుత్సవాలకు 41 రోజులు ముందు నుంచే 41, 21, 11 రోజుల దీక్షలను భక్తులు చేపట్టి జయంతి సందర్భంగా విరమణ చేయడం ఆనవాయితీ. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు.. కొందరు మాలధారణ చేస్తుండగా మరికొందరు స్వామి వారిని దర్శించుకుంటూ మాల విరమణ చేస్తున్నారు.

●ప్రతి ఏటా రెండు ఉత్సవాలు


కొండగట్టులో ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు జరుగుతుంటాయి. చైత్రపౌర్ణమి రోజున చిన్న హన్‌మాన్ జయంతి, తరువాత 41రోజులకు బహుళశుద్ధ దశమి సందర్భంగా పెద్ద హన్‌మాన్ జయంతి నిర్వహించడం ఆనవాయితీ. ఒక్కో జయంతి మూడు రోజుల పాటు జరుగనుండగా లక్షలాదిగా హన్‌మాన్ దీక్షాపరులు కొండకు వచ్చి మాలవిరమణ చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకు దేవస్థానంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే చిన్నహన్‌మాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు కొనసాగుతన్నాయి. మంగళవారం చిన్న హనుమాన్ జయంతి ఘనంగా జరుగనుంది.

● కొనసాగుతున్న ఏర్పాట్లు

చిన్న జయంత్యుత్సవాల ఏర్పాట్ల కోసం కలెక్టర్ యస్మిన్ భాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ దేవస్థానం అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా విభాగాల ద్వారా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొండపైన చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కోనేరు ప్రాంతం, ఆలయం వెనుకాల కూడా ఏర్పాటు చేయగా ఉత్సవాలకు సంబంధించిన స్వాగత తోరణాలు పెట్టారు. వాహనాలలో వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వాటి రోడ్లపై తిప్పులూ భక్తులకు ఎల్లవేళలా నీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వీటితో పాటు లక్షలాదిగా వచ్చే భక్తుల కోసం కొండపైన సీసీ కెమెరాలు ఇతరత్రా ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇంకా కొన్ని పనులు కొనసాగుతూనే ఉండగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. శనివారం నుంచే పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ప్రారంభించారు.

● ఆర్జిత సేవలు రద్దు

ఆదివారం నుంచి 24వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22నుంచి 24వరకు జయంతి ఉత్సవాలు జరుగనుండగా ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు తదితర పూజలు ఉండవని భక్తులు సహకరించాలని కోరారు. కాగా జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ భక్తులకు, దీక్షాపరులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.



కొండగట్టు అంజన్న ఆలయం

● మొదలైన భక్తుల సందడి

చిన్న జయంతికి ముందే కొండకు హన్‌మాన్ దీక్షపరుల రాక మొదలైంది. శనివారం వందలాదాగా హనుమాన్ దీక్షాపరులు అంజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంజన్న స్వాములతో పాటు భక్తులు కూడా వేలాదిగా తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు.బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు.



మాల విరమణ కోసం ఏర్పాట్లు



కొండగట్టు ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు



సిద్ధమవుతున్న లడ్డూ ప్రసాదాలు

యువకుడి ఆత్మహత్య

● లోన్ యాప్‌లో రుణం తీసుకుని మనస్థాపం



జయవర్ధన్(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 20: కుటుంబ సభ్యులకు తెలియకుండా లోన్ యాప్‌లో రుణం తీసుకుని ఆ తరువాత మనస్థాపంతో గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన గాలిపెల్లి జయవర్ధన్ (24) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సింగరేణి కార్మికుడు గాలిపెల్లి తిరుపతికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. చిన్న కుమారుడు జయవర్ధన్ ఐటీఐ చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. జయవర్ధన్ తన ఆర్థిక అవసరాల నిమిత్తం తల్లిదండ్రులకు చెప్పకుండా లోన్‌యాప్ ద్వారా రూ.31వేలు అప్పుగా తీసుకున్నాడు. తరువాత తండ్రి తిరుపతికి తెలిపాడు. తాను డబ్బులు చెల్లిస్తానని తిరుపతి కుమారుడితో పేర్కొన్నాడు. శుక్రవారం రాత్రి 8.30గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంట గదిలో రేకుల షెడ్డుకు చీరతో ఉరి వేసుకున్నాడు. తల్లి గమనించి ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. జయవర్ధన్ తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

● విధులపై నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు

తిమ్మాపూర్, ఏప్రిల్ 20: తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు(జీహెచ్‌ఎం, గ్రేడ్-2) పి రాజాభాను చంద్రప్రకాష్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్(వరంగల్) కె సత్యనారాయణరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజాభాను చంద్రప్రకాష్ ఎల్‌ఎండీ స్కూల్ కాంప్లెక్స్ కింద కొంత మంది ఉపాధ్యాయుల సెలవు జీతాలు చెల్లింపులకు సంబంధించి 10,07,165 రూపాయలు ట్రెజరీకి జమచేయలేదని, డీడీవోగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఇచ్చిన నివేదిక అధారంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. కొందరు ఉపాధ్యాయులు తమకు రావాల్సిన నిధుల విషయంలో నష్టం జరిగిందని, న్యాయం చేయాలని జిల్లా విద్యాశాధికారికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా ప్రధానోపాధ్యాయుడు కూడా తనకు ఆ నిధులకు సంబంధం లేదని, దానికి పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ తిరుమల, ఆమె భర్త రాజ్‌కుమార్ తప్పుడు పత్రాలు సృష్టించి డబ్బులు కాజేసినట్లు ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌తో పాటు, జిల్లా విద్యాధికారి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా విద్యాధికారి డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య నేతృత్వంలో ఈ నెల 5న ముగ్గురితో కూడిన కమిటీని నియమించి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై విచారించిన కమిటీ జిల్లా విద్యాధికారికి నివేదిక సమర్పించింది. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సస్పెండ్ అయిన రాజాభాను చంద్రప్రకాష్ తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కావడం గమనార్హం.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు : డీఐఈవో

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20: బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలను కళాశాలలు కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డీఐఈవో కార్యాలయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలపై చర్చించారు. ఫలితాలు, ప్రవేశాలకు సంబంధించిన ప్రచారాలను చేసుకునే ముందు విధిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసే వరకు ముందస్తు అడ్మిషన్లను తీసుకోవద్దన్నారు. వేసవి సెలవులను మే 31వ తేదీ వరకు ప్రభుత్వం ప్రకటించినందున ఎట్టి పరిస్థితిలో కళాశాలల్లో తరగతులను నిర్వహించవద్దన్నారు. క్వాలిఫై లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని సూచిస్తూ ఇతర నిబంధనలపై కళాశాలల యాజమాన్యాలతో చర్చించారు. సమావేశంలో బాఐఈవో కార్యాలయ పరిపాలనాధికారి సుధాకర్, ప్రైవేట్ కళాశాలల తరుపున మహిపాల్‌రెడ్డి (ఎస్సీజేసీ), మునీందర్ (సాన్వి), అంజిరెడ్డి (రెసొనెన్స్), నాగార్జున్‌రెడ్డి (ఎస్ఆర్), జగన్మోహన్‌రెడ్డి (శ్రీచైతన్య) పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి బాలుడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్ విద్యానగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం రెండవ అంతస్తు పైనుంచి కిందపడి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం చంప జిల్లా జంజిగిరికి చెందిన 18 నెలలు వయస్సున్న రాఖీ కుర్రే తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రెండో రాణా పోలీసులు తెలిపారు. విద్యానగర్‌లో భవన నిర్మాణంలో మేస్త్రిగా పనిచేస్తున్న రవికాంత్ శనివారం ఉదయం తన కొడుకుని వెంటతీసుకుని భవనం నిర్మాణం పనులకు వెళ్లాడు. కొడుకును రెండో అంతస్తులో పడుకోబెట్టి అక్కడే పనులు చేస్తున్నాడు. మధ్యాహ్నం భోజన సమయంలో కొడుకు కోసం తండ్రి వెదకగా కనిపించలేదు. కిందకు వెళ్లిచూడగా తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రూ.88.49 లక్షల నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్‌లో శనివారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో వేర్వేరు చోట్ల నలుగురు వ్యక్తుల వద్ద రూ. 88 లక్షల 49 వేల నగదు పట్టుబడింది. రాజీవ్ చౌక్‌లో నిర్వహించిన తనిఖీల్లో అశోక్‌నగర్‌కు చెందిన ఉప్పుల రాఘవాచారి, హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సూరజ్ రమేష్‌ల వద్ద 71 లక్షల నగదు పట్టుబడింది. ఒక జ్యువెల్లరీ షాపునకు చెందిన నగదును వీరిద్దరూ బైక్‌పై బ్యాగ్‌లలో తీసుకువెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. నగరంలోని ఐబీ చౌరస్తాలో నిర్వహించిన తనిఖీల్లో అశోక్‌నగర్‌కు చెందిన అంకిత్ తివారి వద్ద 2లక్షల 60 వేల నగదు, ఇందిరాచౌక్ వద్ద తనిఖీలలో సుభాష్‌నగర్‌కు చెందిన దామెర అరుణ్‌కుమార్ వద్ద 14 లక్షల 89 వేల నగదు పట్టుబడింది. ఈ డబ్బులు ఒక ఎలక్ట్రానిక్ షోరూంకు చెందినవిగా సమాచారం. మొత్తం 88 లక్షల 49 వేల రూపాయలు సీజ్ చేశామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. 10 లక్షలపైగా పట్టుబడిన నగదును ఆదాయపు పన్నుశాఖ అధికారులకు, 10లక్షలలోపు నగదును జిల్లా మానిటరింగ్ కమిటీకి స్వాధీనం చేశామని ఏసీపీ తెలిపారు. సంబంధిత నగదుకు సంబంధించిన రశీదులు, ఇతర ఆధారాలు చూపించిన తరువాత నగదును రిలీజ్ చేస్తారని తెలిపారు.



సీజ్ చేసిన నగదును చూపుతున్న ఏసీపీ నరేందర్

సుల్తానాబాద్‌లో భారీ వర్షం

- తడిసిన ధాన్యం
- కుప్పలను కాపాడుకోవడానికి రైతుల ఇబ్బందులు





సుల్తానాబాద్ శాసితినగర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలు, ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు



కనుకులలోధాన్యంపై వడగళ్లు

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: సుల్తానాబాద్ ప్రాంతంలో శనివారం అరగంట సేపు భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పంటపొలాలు దెబ్బతినడమే కాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉన్న కుప్పలు తడిసిపోయాయి. ఉదయం పది గంటల తర్వాత నుంచి ఎండ ఉన్నా ఒక్కసారిగా వర్షం పడ డంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. సుల్తానాబాద్‌పట్టణంలోని మార్కెట్ యార్డులో, శాస్త్రినగర్, కాట్నపల్లి, నర్సయ్యపల్లిలోని కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. ఆయా గ్రామాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న పొలాలు కూడా కొంత మేర దెబ్బతిన్నాయి. గొలుసులతో కూడిన వరి నేలకు రాలింది. అయితే అకాల వర్షం రావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ కుప్పలను కాపాడుకోవడానికి కవర్లను కప్పుకున్నారు. సుల్తానాబాద్, కాట్నపల్లి, నర్సయ్యపల్లి, గర్రెపల్లి, భూపతిపూర్ తదితర గ్రామాల్లో మాత్రమే వర్షం పడింది. అంతకుముందు కనుకుల గ్రామంలో వడగళ్ల వాన పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. కుప్పలు ఆరబోసి ఉంచగా ఒక్కసారిగా వడగళ్ల వాన పడడంతో ధాన్యం దెబ్బతింది. అకాల వర్షంతో రైతులు ధాన్యం తడిసి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి మిల్లర్లు కేంద్రాల నిర్వాహకలు ఎలాంటి కొర్రీలు పెడతారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేశం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల మల్లేశంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ మహాలక్ష్మి

గన్నేరువరం, ఏప్రిల్ 20: మండలంలోని గుండ్లపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థిని టి.కారుణ్య జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తెలిపారు. తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మహబూబ్‌నగర్‌లో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అండర్-12 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21నుంచి 24వరకు మహారాష్ట్రలోని దాదర్‌లో జరిగే 17వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొననున్నటు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, పీఈటి జ్యోతి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు హన్మండ్ల భాస్కర్, ఆర్‌సీఓ గౌతంరెడ్డి విద్యార్థిని అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల నిరసన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20: అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజా మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చల్ల నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన పనులు చేయడానికి సర్పంచులు అప్పులు చేశారన్నారు. ఇప్పుడు అప్పు ఇచ్చిన వారు అడుగుతుండడంతో గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం సర్పంచులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. గతంలో ఇచ్చిన చెక్కులు సైతం తిరిగి వచ్చాయన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహించిన మండలాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో లోక్‌సభ ఎన్నిక లలో పోటీ చేసి నిరసన తెలుపుతామని అన్నారు. మాజీ సర్పంచులు గట్టు మల్లారెడ్డి, బిల్లవేని పర్శరాం, కట్ట వెంకటరెడ్డి, ముస్కు మల్లయ్య, కూనబోయిన భాగ్యలక్ష్మి, కేతిరెడ్డి అనసూయ, మంద సుశీల, మేఘలవ్వ, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శ్రీనివాసమూర్తి వైఖరిపై మాజీ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు విన్నవించడానికి వెళ్లగా ఎంపీడీవో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. ప్రజల కోసమే తాము పనిచేశామని, స్వలాభం కోసం చేయలేదని అన్నారు.



నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచులు

బండి సంజయ్‌కి మద్దతుగా రిటైర్డ్ ఉద్యోగుల ప్రచారం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 20: బండిసంజయ్‌కుమార్ గెలుపు కోసం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు ప్రచారాన్ని ప్రారంభించారు. పార్లమెంట్ పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాన్ని నగరంలోని ఎంపీ కార్యాలయంలో శనివారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు ఎడమ సత్యనారాయణరెడ్డి, లాల మురళి మాట్లాడుతూ పిలిస్తే పలికే పోరాట వీరుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంతో ఐదు వందల ఏళ్ల హిందువుల చిరకాల వాంఛ నెరవేర్చిన మహానుభావుడు మోదీ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్‌కుమార్ ఎంపీగా 12వేల కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చారన్నారు. శాతవాహన యూనివర్సిటీకి 12బి, ఎస్సారార్ కళాశాలకు అటానమస్ హోదా తీసకువచ్చిన ఘనత బండి సంజయ్‌దే అన్నారు. 100కు పైగా కేసులు పెట్టినా భయపడకుండా కేసీఆర్ గడీల పాలనను బద్దలు కొట్టారన్నారు. కరీంనగర్‌లో సోషల్ మీడియాలో జరుపుతున్న అసత్య ప్రచారాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

కొత్త ఓటరు కార్డులు పంపిణీ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్ 20: కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలో కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువ ఓటర్లకు వెంటనే కార్డులు అందించలని కోరుతూ శనివారం కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్స్ ఎఫైర్స్ కమిటీ మెంబర్ పొన్నం వెంకటరమణ, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ నాంపల్లి శ్రీనివాస్ తదితరులు పలు ఎన్నికల అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముత్యం శంకర్‌గౌడ్



కరీంనగర్ రూరల్, ఏప్రిల్20: తెలంగాణ రాష్ట్ర సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన ముత్యం శంకర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. శనివారం ఆ సంఘ జిల్లా కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కొడూరి పరశురాములు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా వీణవంక మండలానికి చెందిన దొమ్మాటి రాజగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులుగా జమ్మికుంటకు చెందిన పల్లెల కొమురయ్యగౌడ్, చిగురుమామిడి మండలం చెందిన బుర్ర పరశురామ్‌గౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికకాగా వారిని సత్కరించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, ఆయా గ్రామాల గౌడసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ప్రజామిత్ర మద్దతు'

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమికే తమ మద్దతు ఉంటుందని ప్రజామిత్ర ప్రోగ్రెసీవ్ డెమోక్రటిక్ ఫ్రంట్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరముందన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సమావేశంలో సిగిరి శ్రీధర్, బాపురెడ్డి, తరల్ల నరసయ్య, నేత కిషన్ పాల్గొన్నారు.

బండి సంజయ్ గుడికి..బడికి రూపాయి తేలేదు

హుజూరాబాద్, ఏప్రిల్ 20: కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ కుమార్ నియోజకవర్గంలో గుడికి, బడికి కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని హై స్కూల్ మైదానంలో శనివారం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో కలిసి మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. కేంద్రం నుంచి నిధులు తీ సుకొచ్చే అవకాశం ఉన్నప్పటికీ దాని గురించి బండి సంజయ్ పట్టించుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని పార్టీ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో శనివారం రాత్రి ఆయన గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ ఎడ్ల సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎల్పీవో విచారణ

శంకరపట్నం, ఏప్రిల్ 20: శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామ పంచాయతీ పరిధిలో తప్పుడు ధ్రువపత్రాలతో ఇల్లు మార్పిడి చేసుకున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు హుజూరాబాద్ డీఎల్పీవో శ్రీనివాస్ శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్కే ఖలీల్ అహ్మద్ తప్పుడు ధ్రువపత్రాలతో ఇల్లు మార్పిడి చేశారని జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్పీవో శ్రీనివాస్ విచారణ నిర్వహించారు. ఈ మేరకు ఇరు పక్షాల నుంచి వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో బషీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

శంకరపట్నం, ఏప్రిల్ 20: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం శంకరపట్నం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల్లో ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి రాజయ్య, రాజిరెడ్డి, ఇస్సామొద్దీన్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులను పరిశీలించిన డీఈ

శంకరపట్నం, ఏప్రిల్ 20: శంకరపట్నం మండలం కొత్తగట్టులో గ్రామంలోని తాగునీటి ట్యాంకులను మిషన్ భగీరథ డీఈ వసీయుద్దీన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ వసీయుద్దీన్ పంచాయతీ కార్యదర్శిని గ్రామంలో తాగునీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. పైపు లీకేజీలు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఏఈ మొగిలి, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టి తరలింపు



మట్టి తోడుతున్న ఎక్స్‌కావేటర్

శంకరపట్నం, ఏప్రిల్ 20: కొత్తగట్టు గ్రామ శివారు లోని పెద్దగుట్ట వద్ద అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచి గుట్ట సరిహద్దు భాగంలో ఉన్న మట్టిని మట్టి వ్యాపారులు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదం

-సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్

భగత్‌నగర్, ఏప్రిల్ 20: కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేశ్ అన్నారు. శనివారం కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ దేశ సమగ్రతకు, సమైక్యతకు విఘాతం కలిగించే విధంగా మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకూ పెంచుతూ పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొ రేట్ శక్తులకు అమ్ముకుంటూ దేశ సంపదను దోచుకు న్నారన్నారు. దేశంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలనే ఊడగొట్టారని ఆయన విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల దగ్గర ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కోట్లాది రూపాయలు తీసుకుని వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పేదలపై పన్నుల భారం మోపి అడ్డగోలుగా దోచుకుంటున్నారన్నారు. మోదీకి వ్యతిరేకంగా ఉన్న వారిని ఈడీ, సీబీఐ సంస్థలను అడ్డు పెట్టుకుని జైల్లో వేస్తున్నారన్నారు. మణిపూర్‌లో మహిళలపై వేధింపులు, మహిళా రెజ్లర్లను వేధించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వెంకటేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, వర్ణ వెంకటరెడ్డి, బీమాసాహెబ్, యు శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, జి.రాజేశం, నరేష్‌పటేల్, శీలం అశోక్, మక్కపల్లి పూజ, జి.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి పొన్నంది మచ్చలేని రాజకీయ జీవితం'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 20: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ది మచ్చలేని రాజకీయ జీవితమని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్‌లో బీజేపీలో చేరిన వారు పొన్నం ప్రభాకర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిన అభివృద్ధి కేవలం తీగల గుట్టపల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణం మాత్రమేనని, ఆ పనులు కూడా అరకొరగా జరుగుతున్నాయన్నారు. బీజేపీ నాయకులు తమతో వస్తే పొన్నం ప్రభాకర్ ఎంపీ హయాంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూపిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో బండి సంజయ్ ఓటమి ఖాయమన్నారు. కాంగ్రెస్‌పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్‌పై వ్యాఖ్యలు చేసే బీజేపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. హుస్నాబాద్‌లో బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ రాలేదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు రహమత్‌హుస్సేన్, హైమద్ అలీ, ఎస్ఏ మోసిన్, రామిడి తిరుపతి, ధన్నా సింగ్, బొబ్బిలి విక్టర్, కుంబాల రాజ్‌కుమార్, ఆమీర్, సిరికొండ శివప్రసాద్, గంగుల దిలీప్, పోరండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిపై బండి సంజయ్ శ్వేతపత్రం విడుదల చేయాలి'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 20: కరీంనగర్ ఎంపీగా ఐదు సంవత్సరాల కాలంలో బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంటు నియోజక వర్గానికి చేసిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని టీపీసీసీ కార్యదర్శి రహమత్ హుస్సేన్ డిమాండ్ చేశారు. డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ తన స్థాయి మరచి మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. సంజయ్ కౌన్సిలర్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధనలో పొన్నం ప్రభాకర్ కీలకపాత్ర పోషించాడని, పార్లమెంట్‌లో పెప్పర్‌స్ప్రే దాడికి ఎదురొడ్డి అందరిని ఒప్పించాడని గుర్తు చేశారు. సంజయ్ మాత్రం హిందువులను రెచ్చగొట్టి ఓట్లు దండుకుని ఎన్నికల పబ్బం గడుపుకుంటున్నాడన్నారు. బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. పొన్నం ప్రభాకర్‌పై ఇకముందు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇటీవల హుస్నాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిన నాయకులు ఈరోజు పొన్నం ప్రభాకర్‌పై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు హైమద్ అలీ, నగర కాంగ్రెస్ నాయకులు ధన్నాసింగ్, కుంబాల రాజకుమార్‌లు పాల్గొన్నారు.

'వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపిద్దాం'

భగత్‌నగర్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్ అన్నారు. శనివారం చింతకుంట గ్రామంలో బీఆర్ఎస్ బూత్ కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో గుర్రాల జయప్రకాశ్‌రెడ్డి, చాంద్ పాష, శ్రీనివాస్‌రెడ్డి, రేణి గుంట రాజు, సతీష్, సోమిరెడ్డి, లచ్చిరెడ్డి, సుజాత, స్వప్న, శ్రీకాంత్, ప్రదీప్, మహేష్, సలీం పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలను కూల్చి వేయాలి



మున్సిపల్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్20: కొత్తపల్లి పట్టణంలోని అనుమతి లేని నిర్మాణాలను కూల్చి వేయాలని కోరుతూ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) నాయకులు శనివారం కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కొత్తపల్లి పట్టణంలోని సెయింట్ జార్జ్ స్కూల్ బిల్డింగ్ నిర్మాణం అనుమతులపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బద్రినేత, ప్రశాంత్‌కుమార్, రాజిరెడ్డి, లక్ష్మణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

-బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: తనకు అవకాశం కల్పిస్తే కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన సంజయ్‌కుమార్ ఎంపీగా పోటీ చేసి సానుభూతితో గెలుపొందారన్నారు. ఇపుడు మళ్లీ ఎంపీగా పోటీ చేస్తున్నారని, ఓడిపోయిన వారందరికి కరీంనగర్ ఏమైనా పునరావాస కేంద్రమా ఆయన మండిపడ్డారు. శనివారం ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు జమీలుద్దీన్‌తో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రయోజనాలను కాపాడడంలో బీఆర్ఎస్ ముందుంటుందన్నారు. భారీ మెజారిటీతో వినోద్‌కుమార్‌ను గెలిపించు కుంటామని ధీమా వ్యక్తం చేశారు.

'రాహుల్ ప్రధాని కావాలని కోరుకుంటున్న ప్రజలు'

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 20 : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి శనివారం పాదయాత్ర చేసుకుంటూ పంచ న్యాయాల గ్యారంటీ కార్డులను పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు పరచనున్న పంచ న్యాయాల పట్ల ప్రజలలో మంచి స్పందన వస్తోందని అన్నారు. బండి సంజయ్‌కుమార్ గత అయిదేళ్లలో ఏమీ చేయని అసమర్థ ఎంపీగా మిగిలి పోయాడని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బాధ్యుడు దన్న సింగ్, అబ్దుల్ రహమాన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, ఎండి చాంద్, కుర్ర పోచయ్య, బత్తిని చంద్రయ్య, దండి రవీందర్, లాయక్, షబానా మహమ్మద్, పెద్దిగారి తిరుపతి, అస్తపురం రమేష్, బషీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమగ్ర అభివృద్ధి

- త్వరలో రెండు లక్షల రుణమాఫీ
- కార్యకర్తల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



గంగాధరలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గంగాధర, ఏప్రిల్ 20: కాంగ్రెస్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గంగాధరలో శనివారం నిర్వహించిన చొప్పదండి నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో పొన్నం మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే రెండు లక్షల రుణమాఫీతో పాటు వచ్చే పంటకు బోనస్ అందిస్తామని స్పష్టం చేశారు. ఎంపీగా సంజయ్ కరీంనగర్‌కు, ప్రధాన మంత్రి మోదీ తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరపెల్లి మోహన్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు కర్రసత్యప్రసన్న, చొప్పదండి మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, నాయకులు ఒడితల ప్రణవ్, పద్మాకర్‌రెడ్డి, ఉప్పుల అంజనీ ప్రసాద్, రామడుగు ఎంపీపీ జవ్వాజి హరీష్, ఆరు మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

మానేరు డ్యాంపై బ్రిడ్జి నిర్మించాలి

గన్నేరువరం, ఏప్రిల్ 20: గన్నేరువరం నుంచి కరీంనగర్‌కు మానేరు డ్యాంపై బ్రిడ్జి నిర్మిం చాలని బ్రిడ్జి జేఏసీ సాధన సమితి అధ్యక్షుడు సంపతి ఉదయ్ ఆధ్వర్యంలో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అంద జేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఎన్నికల కోడ్ ముగిశాక ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బ్రిడ్జి జేఏసీ కార్యదర్శి పుల్లెల రాములు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసగించారు

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌మాదిగ

రామడుగు, ఏప్రిల్ 20: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ఎంపీ టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌మాదిగ ఆరోపించారు. మండలంలోని శ్రీరాములపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో మాదిగలను పార్లమెంట్‌కు వెళ్లకుండా అడ్డుకొని వర్గీకరణ చేస్తాననడం హస్యస్పదంగా ఉందన్నారు. రాయోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి మాదిగలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి తడగొండ శంకర్, మల్యాల వినయ్, జితేందర్, రాజన్న, శ్రీనివాస్, మధు, రాజయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

మానకొండూర్, ఏప్రిల్ 20 : మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 30 మంది కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. రాజమౌళి, రఘు, శంకర్, శ్రీనివాస్, అజయ్, నాగరాజు, శివభానుతేజ్‌రెడ్డిలతో పాటు 30 మందికి బండి సంజయ్ బీజేపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన

సైదాపూర్, ఏప్రిల్ 20: మండలంలోని జాగీర్‌పల్లి, వెన్కేపల్లి గ్రామాల్లోని చెరువు లలో ఉపాధిహామీ కూలీలు చేపడుతున్న పూడికతీత పనులను శనివారం పంచా యతీరాజ్ కమిషనర్ కార్యాలయం జిల్లా ప్రత్యేకాధికారి అభయ్‌కుమార్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా కూలీలతో ఆయన మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పని చేసే స్థలంలో కూలీలకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. తాగునీరు, సేద తీరడానికి టెంట్లు, ప్రథమ చికిత్స పరికరాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూలీలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గామీ ణాభివృద్ధి అధికారి శ్రీధర్, అదనపు డీఆర్‌డీవో సంధ్యారాణి, ఎంపీడీవో యాదగిరి, ఏపీవో రాణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో సౌర విద్యుత్‌దే కీలక పాత్ర

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 20 : భవిష్యత్తులో సౌర విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రెండు రోజులుగా నిర్వహిస్తున్న డిజైనింగ్ ఓఫ్ సోలార్ సిస్టం వర్క్‌షాప్ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సౌర విద్యుత్తుతో పనిచేసే పరికరాలను తయారు చేసేందుకు యత్నించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకుడు బి. పురుషోత్తమ చారి, డాక్టర్ కె. శంకర్‌లు విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు, అధ్యాపకులు ఆర్ వేణుమాదవ్, రాకేష్, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు సెమినార్



అతిథిని సన్మానిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ సాగర్‌రావు

తిమ్మాపూర్, ఏప్రిల్ 20: జ్యోతిష్మతి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రీసెంట్ ట్రెండ్స్ అండ్ ఛాలెంజ్ ఇన్ వీఎల్ఎస్‌ఐ డొమైన్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనలాగ్ మిక్స్ సిగ్నల్ ఆర్ అండ్ డీ ఏఎంఎస్ ఓశ్రమ్ ఇండియా హైదారాబాద్ డైరెక్టర్ అడ్జంక్ట్ ప్రొఫెసర్, ఐఐటి హైదారాబాద్ డాక్టర్ కృష్ణకాంత్ అవలూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అతిథులను చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్‌రావు, డీన్ అకాడమిక్స్ వైశాలి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ సంపత్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఏప్రిల్20: నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి11:30 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు హౌసింగ్‌బోర్డ్ ఫీడర్, కాపువాడ ఫీడర్ పరిధిలో హెచ్‌బీకాలనీ, విట్స్ కళాశాల ప్రాంతం, వరాహస్వామి ఆలయ ప్రాంతం, మంగళివాడ, అశోక్‌నగర్, అహ్మద్‌పురా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని టౌన్ వన్ ఏడీఈ కోరారు.

'నేడు మాంసం విక్రయించవద్దు'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్20: మహావీర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం నగరపాలక సంస్థ పరిధిలో మాంసంను విక్రయించవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మేకలు, గొర్రెలు, ఎద్దుల మాంసం విక్రయించకుండా సంబంధిత వ్యాపారులు సహకరించాలని, వధశాలల్లో ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించవద్దని, ఒకవేళ ఎవరైనా నగరంలో మాంసం విక్రయిస్తే చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్లు అందజేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 20: జ్యోతినగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో రెండు ఫ్యాన్లు, కార్పెట్స్‌ను ఆవునూరి వరప్రసాద్, నగునూరి వినయ్ కుమార్, అయితే సుధాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సూర శ్రీనివాస్, కార్యదర్శి రాచకొండ రజనీకాంత్, కోశాధికారి తిరు మల, లక్ష్మణ్, గరిపెల్లి చంద్రం ఉత్తూరి రవీందర్, గరిపెల్లి సత్తయ్య నార్ల వేణుగోపాల్, ఆవు నూరి వరప్రసాద్, సెంటర్ నిర్వాహకులు మెంగని కాత్యాయని, సెంటర్ సూపర్‌వైజర్ స్వప్న పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపిన హైమద్ అలీ

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 20: ఇటీవల నగర కాంగ్రెస్ మైనార్టీసెల్ చైర్మన్‌గా నియమితులైన హైమద్ అలీ శనివారం నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ మొసిన్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు కేటాయించిన పదవి పట్ల బాధ్యతగా వ్యవహరిస్తానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం మైనారిటీలను ప్రత్యేకంగా ఓటు అభ్యర్థించడంతో పాటు వారికి పార్టీ సంక్షేమ పథకాలను వివరిస్తానని హైమద్ అలీ తెలిపారు.

ఘనంగా చంద్రబాబు జన్మదినం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను పార్టీశ్రేణులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కల్యాడపు ఆగయ్య, వంచ శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్ చేసి కేక్, స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల వెంకటయ్య, దామెర సత్యం, సందబోయిన రాజేశం, తీగట్ల రమేశ్, రొడ్డ శ్రీధర్, హయగ్రీవాచారి పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: కరాటేతో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం పెంపొందుతాయని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ బి.రేణుక అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వివేకనంద సీబీఎస్ఈ పాఠశాలలో ఓకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు కలర్ బెల్ట్, గ్రేడింగ్ టెస్ట్‌లను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరాటే నేర్చుకొని భవిష్యత్‌లో క్రీడల్లోనూ రాణించిడంతో ఉన్నత విద్య, ఉత్తమమైన ఉద్యోగాలు పొందడంలో ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కరాటే ప్రశంసా పత్రాలను బెల్టులను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో చీఫ్ ఎగ్జామినర్‌గా రాష్ట్ర కరాటే అసోయేషన్ చైర్మెన్, గ్రాండ్ మాస్టర్ కె వసంత్‌కుమార్, పాఠశాల చైర్మెన్ డాక్టర్ సుధాకర్‌రావు, అకాడమిక్ డైరెక్టర్ పి లతకుమారి, వైస్ ప్రిన్సిపాల్ మొగిలి ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

గంగాధర, ఏప్రిల్ 20: విద్యార్థులు లక్ష్యం కోసం క్రమశిక్షణతో చదవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర వివేకానంద విద్యా సంస్థల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, డైరెక్టర్ అనంతరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉషా, నర్సింగరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

సైదాపూర్, ఏప్రిల్ 20: మండలంలోని గొడిశాల ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో వెంకటనర్సింహారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, ఏఏపీసీ చైర్‌పర్సన్ రజిత, మాజీ సర్పంచ్ చింత లతకుమార్, ప్రధానోపాధ్యాయుడు పన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు

రామడుగు, ఏప్రిల్ 20: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రగతి పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాధాక్రిష్ణ, ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్‌రావు, వెంకట్‌నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య, ఆనంద్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

తిమ్మాపూర్, ఏప్రిల్ 20: మండలంలోని రేణికుంట గ్రామంలో పరిపూర్ణ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉపాధి కూలీలకు, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పని చేస్తున్న హమాలీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు హేమలత, మేనేజర్ మమత, థెరపిస్టులు లతా మాధవి, భరత్, మౌనిక, నాయకుడు సంపత్, రాములు పాల్గొన్నారు.

జిల్లా రెడ్డి సంఘం మహిళా అధ్యక్షురాలిగా సరోజన

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని కందు గుల గ్రామానికి చెందిన కంకణాల సరోజనను జిల్లా రెడ్డి సంఘం మహిళా అధ్యక్షురాలిగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్‌రెడ్డి శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం అభివృద్ధికి పాటుపడుతామని సరోజన తెలిపారు.

భక్తుల ప్రత్యేక పూజలు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని చెల్పూర్‌లో అభయాంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన కాల్వ సదాశివరెడ్డి కుటుంబ సభ్యులు 13 ఫీట్ల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని అందజేశారని ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకులు ఉదయమర్రి కృష్ణమూర్తిశర్మ తెలిపారు.